క్లుప్తంగా

23న ఉచిత మధుమేహ పరీక్ష శిబిరం



నారాయణపేట: లయన్స్‌క్లబ్ ఆఫ్ పేట వారి ఆధ్వర్యంలో ప్రముఖ జనరల్ ఫిజిషియన్ కార్తీక్, గుండె వైద్యనిపుణులు జి.ప్రణయ్ పర్యవేక్షణలో ఈ నెల 23న ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఉచిత మధుమేహ పరీక్షశిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ నిర్వాహకులు పేర్కొన్నారు. శిబిరానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మధుమేహవ్యాధితో అల్సర్‌లతో కాళ్లపై సూదులు గుచ్చుతున్న నొప్పితో బాధపడేవారికోసం ఉచిత మందులతోపాటు మధుమేహ సంబంధిత పరీక్షలు ఉచితంగా చేస్తామన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వెంకటయ్య, సాయినాథ్, కోశాధికారి రవికుమార్‌గౌడ్, జనార్దన్, ఆత్మరాం ఎడిగే, గండె ఉమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎరుకల సంఘం మండల అధ్యక్షుడి ఎన్నిక



మద్దూరు: ఎరుకల సంఘం మండల అధ్యక్షుడిగా మద్దూరుకు చెందిన కిష్టప్పను ఎన్నుకున్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కాచువాగు శివాలయం వద్ద నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు రాగిరి నర్సింహులు ఆధ్వర్యంలో ఏర్పాటుచేశారు. ఉపాధ్యక్షుడిగా కృష్ణయ్య, కిష్టప్ప, ప్రధాన కార్యదర్శిగా బాలప్ప, సంయుక్త కార్యదర్శులుగా రాములు, బాల్‌రాజ్, కో–శాధికారులుగా కృష్ణ, చందయ్య, ప్రచార కార్యదర్శులుగా రాములు, మహేష్, సలహాదారులుగా నారాయణ, కతలప్ప, ఎల్లప్ప, బాలమ్మ, వెంకట్‌రాములు, వీరితోపాటు మరో 25మందిని కార్యవర్గసభ్యులుగా ఎన్నుకున్నారు. ఎన్నికైనా కిష్టప్ప ఎరుకుల వారి అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

గర్భిణి, బాలింతలకు పండ్ల పంపిణీ



మక్తల్: లయన్స్‌క్లబ్ ఆఫ్‌బీమా ఆధ్వర్యంలో ఆదివారం లయన్స్ అధ్యక్షుడు అంబాదాస్ అధ్యక్షతన జిల్లా చైర్మన్ అనుగొండ శ్రీనివాసులు తనయుడు సాయిరాం జన్మదినం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో గర్భిణి, బాలింతలకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అదేవిధంగా పడమటి ఆంజనేయస్వామి ఆలయం వద్ద పేదలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంజన్‌ప్రసాద్, కట్ట వెంకటేష్, శరణప్ప, రవిగౌడ్, సత్యానారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధం



ధన్వాడ: మండలంలోని గోటూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న పంచాయతీ భవనం పనులు పూర్తయి ప్రారంభానికి సిద్ధం చేస్తున్నారు. వచ్చే రెండురోజుల్లో ఎమ్మెల్యే చేతుల మీదుగా భవనం ప్రారంభిస్తామని సర్పంచ్ నారాయణరెడ్డి, ఉపసర్పంచ్ వెంకట్‌రెడ్డి తెలిపారు.మండలంలోని పంచాయతీ భవన నిర్మాణం కోసం నిధులు విడుదలచేసిన వాటిలో గోటూర్ పంచాయతీలో మొదటి పంచాయతీ భవనం నిర్మాణం పూర్తయింది. మిగతా గ్రామాల్లో పూనదులకే పరిమితమైయ్యాయి.

నవంబర్‌లో బొడ్రాయి ప్రతిష్ఠ



అమరచింత: పట్టణంలో నూతన బొడ్రాయి ప్రతిష్ఠ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు కార్యచరణ రూపొందించామని నిర్వహణ కమిటీ సభ్యులు విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. నవంబర్ మాసంలో 14, 15, 16 తేదీలలో బొడ్రాయిలను ఆయావార్డులలో ప్రతిష్ఠించనున్నట్లు తెలిపారు. ఆదివారం ఉత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ రామాలయంలో విడుదల చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలకు సంబంధించి పట్టణ ప్రజలు, భక్తులు ఆర్థిక, వస్తు రూపాల్లో సహాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో తాటికొండ రమేష్, వెంకటేశ్వర్‌రెడ్డి, పురుషోత్తంగౌడ్, మోది మనోహర్ రాజు, నాగప్ప, వడ్ల గోపాల్, శివాజీ, నరసింహులు, శ్రీను పాల్గొన్నారు.

రెండు రోజుల్లోనే ‘రీ సేల్’



రూరల్ పీఎస్ ఎదుట గొర్రెల డీసీఎం

- రాయితీ గొర్రెలు అమ్ముకున్న లబ్ధిదారులు
- తిర్మలాపూర్‌లో పట్టుకున్న పోలీసులు
- దళారి, మధ్యవర్తి, డ్రైవర్, లబ్ధిదారులపై కేసునమోదు

నారాయణపేట రూరల్: కురుమ, గొల్లల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రత్యేక పథకం రూపొందించి రాయితీపై అందించిన గొర్రెలు అక్రమార్కులకు వరంగా మారుతుంది. రెండు రోజుల కిందట స్వయంగా ఎమ్మెల్యే పంపిణీ చేసిన గొర్రెలను 48 గంటలు తిరగక ముందే దళారులతో కలిసి అమ్ముకున్న వైనం పోలీసులు బట్టబయలు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. రెండేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం గొల్ల, కురుమల కోసం రాయితీ గొర్రెల పథకం తీసుకుని వచ్చింది. ఒక్కో లబ్ధిదారుడికి యూనిట్ కింద 20 గొర్రెలు, ఒక పొటేలు చొప్పున అందిస్తుంది. దీనికి లబ్ధిదారుడు రూ.43,500 చెల్లిస్తే ప్రభుత్వం రూ.1.75 లక్షలను కలిపి ఇతర రాష్ట్రాల్లో వెటర్నరీ వైద్యుల బృందం పర్యవేక్షణలో వాటిని కొనుగోలు చేసి అందిస్తుంది. ఈ క్రమంలో మండలంలోని తిర్మలాపూర్‌కి ఇప్పటి వరకు 110 యూనిట్ల గొర్రెలను ప్రభుత్వం మంజూరు చేసి అందించింది. ఈ నెల 18న రెండో విడత కింద 48 యూనిట్ల గొర్రెలను లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి స్వయంగా అందజేశారు.



దళారులకు అమ్ముకున్న రాయితీ గొర్రెలు

మధ్యవర్తి సహకారంతో అమ్మకం..

సదరు లబ్ధిదారులు మద్దూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన మధ్యవర్తి చంద్రప్ప ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మాచర్లకు చెందిన దళారి కాటం నాగరాజుతో గొర్రెలు అమ్మడానికి ఒప్పందం చేసుకున్నారు. ఒక్కో యూనిట్ దాదాపు రూ.1.06లక్షలు మాట్లాడుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలో శుక్రవారం పంపిణీ చేసిన వాటిలో 13 యూనిట్ల గొర్రెలను 48 గంటల్లో దళారికి అమ్మేశారు. ఆదివారం మధ్యాహ్నం రెండు డీసీఎంలతో ఎక్కించి తీసుకుని వెళ్తున్నారు. కోటకొండ శివారులో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న రూరల్ పోలీసులకు నమ్మదగ్గ సమాచారంతో డీసీఎంలను తనిఖీ చేసి విచారణ చేయగా నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. అనుమానం వచ్చి వెంటనే వెటర్నరీ డాక్టర్ అనిరుద్ ఆచార్యను పిలిపించి పరిశీలించమని చెప్పారు. దీంతో అతను ప్రభుత్వం అందించిన రాయితీ గొర్రెలని తేల్చారు. గొర్రెలను స్వాధీనం చేసుకుని గ్రామ శివారులోని చెరువు వద్ద ఉంచి భద్రత ఏర్పాటు చేశారు.

ఒకటి మృతి.. మరొకటి ప్రాణాపాయ స్థితి..

గొర్రెల కొనుగోలుకు వచ్చిన దళారి నాగరాజు రెండు డీసీఎంలు గ్రామానికి తీసుకొచ్చారు. దాదాపు 273 గొర్రెలను వాటిలో కిక్కిరిసి ఎక్కించడంతో ఊపిరి ఆడక ఒక గొర్రె మృతిచెందింది. అదేవిధంగా మరో గొర్రె ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతుంది. అక్రమంగా గొర్రెలను తరలించడంతో పాటు ప్రభుత్వం రాయితీపై అందించిన గొర్రెలను అమ్మడం, కొనడం నేరంగా పరిగణించి దళారి నాగరాజు, మధ్యవర్తి చంద్రప్ప, డ్రైవర్‌తో పాటు గొర్రెలు అమ్మిన లబ్ధిదారులపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జయప్రసాద్ తెలియజేశారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

- ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మక్తల్: అందరి సహకారంతో మున్సిపాలిటీని అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలో తొమ్మిదో వార్డులో సీసీరోడ్డుకు రూ.10లక్షలతో సీడీపీ గ్రాంట్ నుంచి నిధులు మంజూరు చేయించి పనులను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పట్టణాన్ని అభివృద్ధి చేసేందుకు రూ. 3.52 కోట్లు నిధులు మంజూరు చేయించామన్నారు. టీయూఎఫ్ఐడీసీని ఏర్పాటుచేసేందుకు రూ. 5కోట్ల నిధులను విడుదల చేయించినట్లు తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అన్నివర్గాలకు సముచితస్థానం కల్పించడం జరిగిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డిని శాలువాతో సన్మానం చేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ నర్సింహగౌడ్, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, కమిషనర్ బాల్‌రాంనాయక్, వార్డుకౌన్సిలర్ రాధిక, ఏఈ నాగశివ, నాగిరెడ్డి, శివారెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, సత్యారెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

ఊట్కూరు: ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌యూ నాయకులు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం పెద్దపొర్లలో విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యాసంస్థల్లో సమస్యలు కొట్టుమిట్టాడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ విషయమై సోమవారం కలెక్టరేట్ ముట్టడిని చేపట్టినట్లు తెలిపారు. పాఠశాలలు ప్రారంభమై మూడునెలలు గడుస్తున్నా ఇప్పటికీ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందడం లేదని, అలాగే ప్రైవేట్ పాఠశాలల్లో అధికఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. జిల్లా కేంద్రంలో మహిళా డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ముట్టడిలో విద్యార్థులు, విద్యావంతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు భరత్, ఆంజనేయులు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆవిర్భావ సభను విజయవంతం చేయండి

నర్వ: ధర్మసమాజ్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా ప్రచార కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సోమవారం జిల్లా కేంద్రంలోని శీలాగార్డెన్స్‌లో నిర్వహించే ఆవిర్భావ సభను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ విశారధన్‌మహారాజ్ హాజరవుతున్నారని, ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రజలందరూ అధికసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ జిల్లా ప్రచార కమిటీ సభ్యులు శ్రీనివాస్‌మహారాజ్, రాము మహారాజ్, అశోక్‌మహారాజ్, ఆంజనేయులు మహారాజ్, రామన్‌గౌడ్, అంజన్న తదితరులు పాల్గొన్నారు.

గృహలక్ష్మి దరఖాస్తుల పరిశీలన



నేరడగంలో దరఖాస్తుదారుల వివరాలు సేకరిస్తున్న ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి

మాగనూర్: గృహలక్ష్మి పథకం కింద సొంత ఇంటి నిర్మాణం కోసం వచ్చిన దరఖాస్తులను ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. మండలంలోని నేరడగంలో ఇంటినిర్మాణం కోసం మొత్తం 161మంది దరఖాస్తులు చేసుకున్నట్లు అధికారులు నివేదిక అందించినట్లు పేర్కొన్నారు. ఖాళీస్థలం ఉన్నవారికి ఇంటినిర్మాణం కోసం ప్రభుత్వం రూ. 3లక్షలు ఆర్థిక సాయం చేయనున్నది. ఈ పథకం అర్హులకు వర్తిస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నర్సప్ప, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



పగిడిమారిలో దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

ఊట్కూరు: గృహలక్ష్మి పథకం కింద సొంత ఇంటి నిర్మాణం కోసం వచ్చిన దరఖాస్తులను ఆదివారం గ్రామాల్లో బృందాల వారిగా ఇంటింటికీ వెళ్లి దరఖాస్తు దారుల వివరాలను సేకరిస్తున్నారు. మండలంలోని పగిడిమారి, పులిమామిడి, నిడుగుర్తి, చిన్నపొర్ల, మల్లేపల్లి తదితర గ్రామాల్లో అధికారులు గృహలక్ష్మి దరఖాస్తుల వివరాలను సేకరించారు. ఎంపీడీవో కాళప్ప స్వయంగా పగిడిమారిలో ఇంటింటికీ తిరిగి దరఖాస్తుదారుల వివరాలు పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు నాగిరెడ్డి, సుమలత, రాజేశ్, రాంనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గుడిగండ్లలో బీఎస్పీ జెండా ఆవిష్కరణ



మక్తల్: మండలంలోని గుడిగండ్లలో ఆదివారం బీఎస్పీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ జెండా ఎగుర వేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. బహుజనుల కోసం కృషి చేయాలని అన్నారు. బహుజనులకు అధికారం లేకుండా పోయిందని అన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు వెంకటయ్య, అర్జున్‌రాజు, పరపురాం, మోహన్, గౌస్, ఆంజనేయులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బీటీరోడ్డు పనులు



ధన్వాడ: మండలంలోని కిష్టాపూర్‌నుంచి గోటూర్ వరకు నిర్మిస్తున్న బీటీరోడ్డు పనులు చివరిదశకు చేరుకున్నాయి. కాంట్రాక్టర్ మాట్లాడుతూ.. కంకర వేయడం అయిపోయిందని ఇంకోవారం రోజుల్లో బీటీపనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ రోడ్డు పూర్తయితే గోటూర్ నుంచి కిష్టాపూర్ మీదుగా ధన్వాడ మండలకేంద్రానికి వచ్చేందుకు దగ్గర అవుతుందని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పనులు త్వరగాపూర్తి చేయాలని కోరుతున్నారు.

వెలగని హైమస్ట్ లైట్లు

అమరచింత: మండలంలోని కిష్టంపల్లి ఎక్స్‌రోడ్‌లో ఏర్పాటు చేసిన హైమస్ట్ లైట్లు ఉత్సవ విగ్రహాలుగా మారాయి. వెలగకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ఇందిరమ్మ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన హైమస్ట్ లైట్లు కొన్ని నెలలుగా వరిగిపోతూ కిందపడుతున్నా తొలగించడంలో విఫలమవుతున్నారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద చౌరస్తాలో నిత్యం రాత్రి వేలలో వెలుతురు ఉండాలని ఏర్పాటు చేసిన హైమస్ట్ లైట్లను పునరుద్ధరించాలని జూరాల ప్రాజెక్టు సందర్శనకు వెళ్తున్న ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి దరఖాస్తు



మక్తల్ అభ్యర్థిత్వానికి దరఖాస్తు చేస్తున్న పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి

నర్వ: కాంగ్రెస్‌మక్తల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు అవకాశమివ్వాలని పార్టీ అధిష్టానానికి టీపీసీసీ ఎస్‌ఆర్‌ఐ సెల్‌కోర్ కమిటీ సభ్యులు పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఏర్పాటుచేసిన ప్రత్యేకసెల్‌లో ఈ దరఖాస్తును డీసీసీ అధ్యక్షుడు వాకిటి శ్రీహరీ, రాష్ట్రగౌడ సంఘం నాయకులు నాగరాజ్‌గౌడ్‌లతో కలిసి సమర్పించినట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసేందుకు తనకు అన్ని అవకాశాలున్నాయని, పీసీసీ పేర్కొన్న ప్రత్యేక ఫార్మట్‌లో ఆయన దరఖాస్తు చేసినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. యువతకు భవిష్యత్తు అవకాశాలను కల్పించేందుకు ఒక్క అవకాశం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులున్నారు.

ఆలయానికి విద్యుత్ సౌకర్యం

దామరగిద్ద: మండలంలోని కాన్‌కుర్తిలో రేణుక ఎల్లమ్మ ఆలయ అభివృద్ధిలో భాగంగా ఎమ్మెల్యే ఎస్ రాజేందర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఆదివారం విద్యుత్ సౌకర్యం కల్పించారు. స్థానిక బీఆర్ఎస్ నాయకులు రైతుబంధుసమితి గ్రామ అధ్యక్షుడు భీంరెడ్డి, ఆలయ కమిటీసభ్యులు విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరుతూ విద్యుత్‌శాఖ అధికారులకు, ఎమ్మెల్యే ఎస్ రాజేందర్‌రెడ్డికి విన్నవించారు. దీంతో స్పందించి అధికారులతో మాట్లాడి ఆలయానికి విద్యుత్ సదుపాయం ఏర్పాటు చేసేందుకు ఏడు విద్యుత్‌స్తంభాలు, విద్యుత్ తీగలను సమకూర్చడంతో విద్యుత్‌లైన్ ఏర్పాటుచేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే ఎస్ రాజేందర్‌రెడ్డికి, విద్యుత్‌శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు భీంరెడ్డి, నర్సింహ, లైన్‌మెన్ బస్వరాజ్, ఆలయ పూజారి బోనప్ప, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్‌స్తంభానికి బల్బులను ఏర్పాటుచేస్తున్న నాయకులు

క్రీడాకారులకు సామగ్రి అందజేత



క్రీడాసామగ్రిని అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మరికల్: మండల క్రీడాకారులను ప్రోత్సాహించేందుకు బీఆర్ఎస్ నాయకులు తమవంతు సాయంగా క్రీడా సామగ్రిని అందజేశారు. ఆదివారం బాలురపాఠశాలలో సర్పంచ్ గోవర్ధన్, బీఆర్ఎస్ నాయకులు రాజేష్, రామకృష్ణారెడ్డి క్రీడాసామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడాకారులను ప్రోత్సాహించేందుకు ఎప్పటికీ తమవంతు సహకారం ఉంటుందన్నారు. మండలస్థాయి క్రీడాపోటీల నుంచి జాతీయస్థాయి పోటీల్లో రాణించేందుకు క్రీడాకారులు కృషిచేసి మరికల్‌కు పేరుప్రతిష్ఠను తీసుకురావాలని వారు ఆకాంక్షించారు. క్రీడా సామగ్రిని అందజేసిన నాయకులకు క్రీడాకారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యువక మండలి అధ్యక్షుడు రవికిరణ్, లక్ష్మయ్య, రవి పాల్గొన్నారు.

అరాచకపాలనకు చరమగీతం తప్పదు

నారాయణపేట రూరల్: రాష్ట్రంలో కొనసాగుతున్న అరాచక పాలనకు చరమగీతం పాడి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపడం ఖాయమని బీజేపీ రాష్ట్ర నాయకులు, నియోజకవర్గ ఇన్‌చార్జి కే.రతంగ పాండురెడ్డి అన్నారు. ఆదివారం నిర్మల్ జిల్లాకేంద్రంలో నూతనంగా తీసుకొచ్చిన మాస్టర్ ప్లాన్, జీఓ 220కి వ్యతిరేకంగా బీజేపీ చేపట్టిన నిరహారదీక్షకు మద్దతు తెలపడానికి వెళ్లిన ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అక్రమ అరెస్టుకు పేటలో నిరసన వ్యక్తం చేశారు. స్థానిక శ్రీసత్యనారాయణ చౌరస్తాలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి మాట్లాడారు.. తెలంగాణలో నిరంకుశత్వపాలన కొనసాగుతుందని, పోలీసులతో ప్రతిపక్షాలను అణిచివేస్తున్నారని విమర్శించారు. ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. నర్సింహులు, రఘువీర్, రఘురామయ్యగౌడ్, రఘుపాల్‌రెడ్డి, మల్లేష్, నర్సింగ్‌రాథోడ్, ప్రకాష్ పాల్గొన్నారు.

మక్తల్: నిర్మల్ జిల్లా కేంద్రంలో నూతనంగా తీసుకొచ్చిన మాస్టర్ ప్లాన్, జీఓకి వ్యతిరేకంగా బీజేపీ చేపట్టిన నిరహారదీక్షకు మద్దతు తెలపడానికి వెళ్లిన ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అక్రమ అరెస్టుకు పట్టణంలో అంబేడ్కర్ చౌరస్తాలో నాయకులు నిరసనవ్యక్తం చేశారు. ఎంపీటీసీ బాల్‌రాంరెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ కర్ని స్వామి, మండల అధ్యక్షుడు లక్ష్మన్, రాజశేఖర్‌రెడ్డి, మల్లికార్జున్, రమేష్, ప్రతాప్‌రెడ్డి, నాగేష్, నర్సింహారెడ్డి, నాగప్ప పాల్గొన్నారు.



పేటలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

అంధకారంలో అమరచింత బస్టాండ్

అమరచింత: మున్సిపల్ కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ మూడు నెలలుగా అంధకారంలో మగ్గుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. మూడు నెలలుగా బస్టాండ్‌లో రాత్రిపూట కరెంటు సౌకర్యం లేక విద్యుత్ బల్బులు వెలగడం లేదు. సాయంత్రం ఏడు గంటలకే బస్టాండ్ పరిసరాల్లో చిమ్మచీకటి అలుముకుంటోంది. ఇతర ప్రాంతాల నుంచి పట్టణానికి వచ్చే ప్రయాణికులు చీకటిగా ఉన్న బస్టాండ్‌లో నిల్వలేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా చర్య తీసుకొని బస్టాండ్‌లో విద్యుత్ సౌకర్యం ఏర్పాటుచేసి ప్రయాణికుల ఇబ్బందులు తీర్చాలని కోరుతున్నారు.

రాజీవ్ గాంధీకి ఘననివాళి



పేటలో రాజీవ్‌గాంధీచిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



మక్తల్‌లో..

నారాయణపేట: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకొని ఆదివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో పార్టీ నాయకులు రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. రాజీవ్‌గాంధీ అతి చిన్న వయస్సులో దేశప్రధానిగా పనిచేసి ఎనలేని సేవలు అందించారని గుర్తుచేశారు. నాటి ప్రధానిగా రాజీవ్‌గాంధీ కృషితోనే నేడు మనదేశం సాంకేతిక రంగంలో అభివృద్ధి సాధించిందన్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలోనే దేశం అభివృద్ధి చెందిందని రాజీవ్‌గాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎండీగౌస్, శశికాంత్, కౌన్సిలర్ ఎండీ సలీం, నాయకులు రమేష్, చిన్నయ్య, మహిముద్, యూసుఫ్‌తాజ్, శ్యాంగోపాల్, సీతారాంరెడ్డి, నరేశ్, సందీప్, రాజుగౌడ్, బండి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మక్తల్: మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా ఆదివారం బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహులు ఆయన చిత్రటానికిపూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో రావడం ఖాయమని దీమావ్యక్తం చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుక్షుడు బి.నర్సింహులు, గణేష్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు బోయేరవి, గోవర్ధన్, నారాయణ, నూరోద్దిన్, గుంతలిరవి, ఆనంద్, ఓబులేష్, రాజేందర్, జనార్దన్, నర్సింహులు, ఫయాజ్, నరేందర్, ప్రవీణ్‌కుమార్, కట్టవెంకటేష్ పాల్గొన్నారు.

మరికల్: మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఇందిరగాంధీ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పడ్లు, బ్రెడ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వీరన్న, కృష్ణయ్య, అంజిరెడ్డి, మల్లయ్య, ఆనంద్, రఘు, చెన్నయ్య పాల్గొన్నారు.